సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం, 3, సెప్టెంబర్, 2024



పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 586.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 5,41,643 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 5,03,268 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,582 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6,253 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 641.50 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 7,549 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 6,200 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

యాదగిరిగుట్టలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం రిజిస్ట్రేషన్లకు ఆటంకం ఏర్పడింది. సర్వర్‌లో సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. వర్షాలకు సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. సర్వర్‌లో సమస్య తలెత్తడం వల్ల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సాయంత్రం వరకు నిరీక్షణ తప్పలేదు.

'రామానందతీర్థ'ను సందర్శించిన కలెక్టర్



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను సోమవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగే సందర్శించారు. కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్, టైలరింగ్ తదితర కోర్సులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి కోర్సులు ఎలా ఉన్నాయి, శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగం చేస్తారా లేదా స్వయం ఉపాధిని ఎంచుకుంటారా.. అని అడిగారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని వారికి సూచించారు. అనంతరం హాస్టళ్లకు వెళ్లి వసతులు, భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, సంస్థ ఫ్యాకల్టీలు ఉన్నారు.

సేంద్రియ సాగుతో అనేక ప్రయోజనాలు



సదస్సులో పాల్గొన్న మాజీ మంత్రి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

బీబీనగర్ : రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేసేందుకు దృష్టి సారించాలని మాజీ మంత్రి, రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి సూచించారు. భువనగిరి మండల పరిధిలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో సోమవారం ఆర్గానిక్ పంటలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడి సాధించేందుకు పెద్ద మొత్తంలో రసాయన ఎరువులు వినియోగిస్తున్నారని, దీనిద్వారా భూసారం క్షీణించడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమై ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు.

'పొతి రద్దు చేయండి'

భువనగిరి టౌన్ : ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని,పొతి రద్దు చేయాలని కోరుతూ మోటకొండూరు మండలం సికిందర్‌నగర్‌కు చెందిన పలువురు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సికిందర్‌నగర్‌లోని సర్వే నంబర్ 533 బిలో షేక్ ఖాసీం భర్త గఫర్ పేరున గల నాలుగు ఎకరాల భూమిని తప్పుడు ధ్రువీకరణ పత్రంతో ఇతరులకు తప్పుడు పొతి చేశారని ఆరోపించారు. వెంటనే రద్దు చేయాలని కోరారు. ధర్నాలో పెద్ద కోట్ల చిన్నయ్య, కొంతతం మోహన్‌రెడ్డి, పసల చిన్నయ్య, చిన్న బత్తిని బాలస్వామి, పంతులు బాల, పెద్దకోట్ల గోరింట ఆరోగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా అర్చకులు సుప్రభాత సేవ చేపట్టి, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీ అర్చన చేశారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఇక ముఖమండపంలో పుష్పార్చన, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమంనిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, జోడు సేవో త్సవం తదతర కైంకర్యాలు గావించారు. స్వామి వారికి నిత్యాదాయం రూ.15,84,978 సమకూరిందని అధికారులు వెల్లడించారు.



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం భువనగిరిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

మహానేతకు నివాళి

భువనగిరిటౌన్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం భువనగిరిలోని విద్యానగర్‌లో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిరుపేదలకు వైద్యం అందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, పోత్నక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, భువనగిరి పట్టణ ప్రెసిడెంట్ కూర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఊరట

ఏడాది తరువాత జిల్లాలో ఇవే పెద్ద వర్షాలు



వర్షాలకు ఆలేరు సమీపంలో నిగనిగలాడుతున్న పత్తి చేను

- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న నీరు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- పత్తి, వరి పంటలకు ప్రాణం

సాక్షి, యాదాద్రి : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలో ఆశలు చిగురిస్తున్నాయి. గత సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఒక్క పెద్ద వర్షం కూడా కురువలేదు. తాజాగా కురుస్తున్న వానలే పెద్దవి కావడం.. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండడం ఊరటనిస్తోంది.

వర్షాభావంతో తగ్గిన వరి సాగు

గత సెప్టెంబర్ 17 నుంచి జిల్లాలో సరైన వర్షం కురువలేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఈ వానాకాలం 3.10 లక్షల ఎకరాల్లో వరిసాగు కానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ, అతి కష్టం మీద 2.30 లక్షల ఎకరాలు సాగు చేశారు. వర్షాభావం కారణంగా భూగర్భజలాలపై ఆధారపడి వరి సాగు చేస్తున్న రైతులు అయోమయంలో పడ్డారు. యాసంగి వరి సాగు ప్రశ్నార్థకమేనన్న భావనలో ఉన్నారు. ఈ సమయంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలో ఆశలు చిగురింపజేస్తున్నాయి.

పత్తికి ప్రాణం

లక్ష ఎకరాల్లో సాగు చేసిన పత్తికి వర్షాలు ప్రాణం పోశాయి. చేలు కాపుకొస్తున్న సమయంలో సరైన వానలు లేకపోవడంతో రైతులు ఆకాశం వంక చూస్తున్నారు. చేలను కాపాడుకునేందుకు కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటి తడులు కట్టి పంటలను కాపడుకుంటున్నారు. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలు పత్తికి ఊపిరిపోశాయి. మరో నెల రోజుల వరకు వర్షం కురువకపోయినా నష్టం లేదని రైతులు అంటున్నారు.

20 ఇళ్లు ధ్వంసం

వర్షాలకు జిల్లాలో 20 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. తుర్కపల్లిలో 7, భువనగిరిలో 1 బీబీనగర్‌లో 5, అడ్డూడూరులో 3, పోచంపల్లి 3, చౌటుప్పల్ మండలంలో ఇక ఇల్లు దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు.



బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో కూలిన ఇల్లు

పత్తికి ఇబ్బంది లేదు



పది ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వర్షాలు లేకపోవడంతో బోరు నీళ్లతో తడులు అందిస్తున్నా. అయినా పూర్తి స్థాయిలో నీరందడం లేదు. పంట చేతికొస్తుందో లేదోనన్న ఆందోళన ఉండేది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తికి ప్రాణం పోశాయి. 20 రోజుల వరకు వర్షం లేకపోయినా పత్తికి నష్టం ఏమీ లేదు. వర్షాలు తగ్గి వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

–పక్కీరు అనంతరెడ్డి, దాసిరెడ్డిగూడెం

భూగర్భజలాలు పెరిగాయి



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడ్డగూడూరు మండలంలో పలు చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది.దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. నాకు రెండున్నర ఎకరాల భూమి ఉండగా వర్షాలు కురువడంలేదని ఈసారి 30 గుంటల్లోనే వరి సాగు చేశాను. అందులో నీరులేక సగం పొలం ఎండు దశకు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పొలానికి ప్రాణం పోశాయి. భూగర్భ జలాలు పెరగడంతో మరికొంత నాటు వేసేందుకు సిద్ధమవుతున్నా.

–తుప్పరి మధు, అడ్డగూడూరు

మూసీని పరిశీలించిన కలెక్టర్

బీబీనగర్ : మండలంలోని రుద్రవెల్లి వద్ద మూసీలో వరద ఉధృతిని సోమవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగే పరిశీలించారు. బారికేడింగ్ బందోబస్తుతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, వరదలు వస్తున్నందున బ్రిడ్జిలు, కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు మూసీలో చేపలవేటకు వెళ్లరాదని సూచించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి నీటి వనరుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడరాదని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్లు శ్రీధర్, బేగంపేట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీఓ ఉన్నారు.



అలుగుపోస్తున్న అజీంపేట చెరువు

కొన్ని చోట్ల బోర్లు రీచార్జ్

బిక్కేరు, చిన్నేరు, ఆలేరు వాగులకు వరద నీరు చేరుతుండడంతో ఆయకట్టులో బోర్లు రీచార్జ్ అవుతున్నాయి. నాన్‌ఆయకట్టు మండలాల్లోనూ భూగర్భ జలాలు పైకొచ్చే అవకాశాలున్నాయి. ఇక మూసీ ఆయకట్టు చెరువులు 80 శాతం జలకళను సంతరించుకున్నాయి.



రుద్రవెల్లి వద్ద మూసీలో వరద నీటిని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

మోస్తరు వర్షం

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఆలేరు మండలంలో 61.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మూసీలో వరద ఉధృతి కొనసాగుతోంది. లో లెవల్ బ్రిడ్జిల వద్ద రాకపోకలు నిలిపివేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కాపలా కాస్తోంది.

మండలాల వారీగా కురిసిన వర్షం

మండలం	మి.మీ				
ఆలేరు	61.6	రామన్నపేట	33.1	మోత్కూర్	22.0
తుర్కపల్లి	43.8	బొమ్మలరామారం	29.3	నారాయణపురం	21.8
రాజాపేట	36.8	వలిగొండ	28.3	మోటకొండూర్	22.8
చౌటుప్పల్	36.3	యాదగిరిగుట్ట	30.0	అడ్డగూరురు	22.0
పోచంపల్లి	36.0	ఆత్మకూర్	27.5	బీబీనగర్	20.8
		భువనగిరి	31.0	గుండాల	14.3

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- ప్రారంభమైన పోషణ మాసోత్సవాలు
- పోషకాహార విలువలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న కార్యక్రమాలు



భువనగిరిటౌన్: మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన మాసోత్సవాలు ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణపై అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో భువనగిరి, మోత్కూర్, రామన్నపేట, ఆలేరు ప్రాజెక్టుల పరిధిలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. గ్రామస్థాయిలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రణాళికలు రూపకల్పన చేశారు.

కార్యాచరణ ఇలా..

మొదటి వారం : ప్రత్యేక పెరుగుదల పర్యవేక్షణ డ్రైవ్ నిర్వహిస్తారు. చిన్నారుల బరువు, జబ్బ చుట్టూ కొలత తీసుకుని వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయడం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పోషణ ట్రాకర్‌లో నమోదు, చిన్నారులకు టీకాలు, గర్భిణులకు ఆస్పత్రిలో చెకప్, పోషకాహారంపై అవగాహన, అనుబంధ పోషకాహార కార్యక్రమం, టేక్ హోం, రేషన్(టీహెచ్ఆర్), ఐరన్, కాల్షియం మాత్రలపై అవగాహన కల్పిస్తారు.

రెండో వారం : చిన్నారుల బరువు చూడడం, పెరటి తోటల పెంపకం ప్రారంభం, విటమిన్ -సి అధికంగా ఉండే పండ్ల మొక్కల పెంపకం, అంగన్‌వాడీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, గర్భిణుల నమోదు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, కిశోర బాలికలకు రక్త పరీక్షలు, ఆరోగ్య, పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తారు.

మూడోవారం : చిన్నారులకు టీకాలు, గర్భిణుల బరువు చూడడం, పరీక్షలు చేయించడం, పోషకాహారం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన, గర్భిణుల నమోదు, ర్యాలీలు, అవగాహన సమావేశాలు ఏర్పాటు, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నాలుగో వారం : పోషకాహారం తీసుకునేందుకు శుభ్రత పాటించడం, ఉదయం ప్రార్థనలో పోషకాహారంపై రోజువారీ సందేశాలు ఇవ్వడం, వ్యాసరచన పోటీలు, చేతుల శుభ్రతపై ప్రదర్శనలు చేయించనున్నారు. అలాగే గృహ సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నాం

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాల నిర్వహణ చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాం. అన్ని శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పోషకాహార విలువలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాం. అంగన్‌వాడీ అధికారులు, సిబ్బందికి పోషణ మాసోత్సవాలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చాం. పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల వివరాలు నమోదు చేయడంతోపాటు పరీక్షలు, వైద్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం.

– కేవీ కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారిణి

బాధితులను ఆదుకుంటాం



మోతె వద్ద అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

ఉమ్మడి నల్లగొండలో రూ.22 కోట్ల నష్టం వాటిల్లింది

- దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయండి
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- వర్షాలు, వరదలపై సూర్యాపేట జిల్లా మోతె సమీపంలో సమీక్ష

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, మోతె : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వర్ష బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని.. ఆస్తి, పంట నష్టానికి పరిహారం చెల్లిస్తామని.. ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించేందుకు ఖమ్మం వెళ్తూ సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆగారు. ఇక్కడ ఓ ఫంక్షన్ హాల్‌లో అధికారులతో సమావేశమై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వర్షాలకు జరిగిన నష్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రాథమిక అంచనా ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.22 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, అత్యధికంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో నష్టం జరిగిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ నష్టాన్ని అంచనా వేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. చెరువుల గండ్లను పూడ్చేందుకు, దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించేందుకు తక్షణ సాయం కింద సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు రూ.5 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు.

సాగర్ ఎడమ కాల్వ గండిని వారం రోజుల్లో పూడుస్తాం : మంత్రి ఉత్తమ్

భారీ వర్షాల వల్ల సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వకు గండి పడి 300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాల్వ గండిని వారం రోజుల్లో పూడుస్తామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో 11 రోడ్లు ధ్వంసమయ్యాయని వాటి శాశ్వత మరమ్మతులకు రూ.22 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 6 చెరువులు తెగాయని, వాటికి వెంటనే మరమ్మతు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సమీక్షలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్, ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఆర్డీఓ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

చౌటుప్పల్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు ఆదేశించారు. చౌటుప్పల్‌లోని ఏసీపీ కార్యాలయంలో సోమవారం యాదాద్రి జిల్లా ట్రాఫిక్, సివిల్ ఏసీపీలు, సీఐలతో సమీక్ష నిర్వహించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పని చేయని సీసీ కెమెరాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలుంటాయన్నారు.

గణేశ్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

గణేశ్ ఉత్సవాలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. దండుమల్కాపురం చెరువును సోమవారం ఆయన సందర్శించారు. నిమజ్జనం రోజు చేయాల్సిన ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని చెరువులను పరిశీలించి, ఏ చిన్న సమస్య తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ముందస్తుగా పోలీసు శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాల వద్ద నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ మనోహర్, క్రైం డీసీపీ అరవింద్‌బాబు, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారయణ, చౌటుప్పల్ ఏసీపీ మధుసూధన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్, రూరల్ సీఐ రాములు,ఎస్సై లక్ష్మయ్య ఉన్నారు.



దండుమల్కాపురం చెరువును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అందుబాటులో డెంగీ, మలేరియా కిట్లు

- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ యశోద

భూదాన్‌పోచంపల్లి : సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ యశోద తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో మలేరియా, డెంగీ నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్ పరిశీలించారు. అనంతరం గూగుల్‌మీట్ ద్వారా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది, ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవాణి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీలో మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఇంచార్జ్ డీఎంహెచ్‌ఓ

వైద్యసహాయం కోసం 81251 47540

భువనగిరి : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. వైద్య సహాయం కోసం, ఏదైనా సమస్య ఉన్నా కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన 81251 47540 నంబర్‌ను సంప్రదించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఆరు బయట దొరికే ఆహార పదార్థాలను భుజించవద్దని సూచించారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు వేడి ఆహారపదార్థాలు అందజేయాలని, ఆరోగ్య సమస్యలు ఉంటే తక్షణమే సంబంధిత వైద్యాధికారి లేదా ఆశా కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని హాస్టళ్ల ప్రత్యేకాధికారులకు సూచించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లగొండక్రైం: పట్టణంలోని పానగల్ బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ ఎస్ఐ–2 మానస సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహాన్ని గుర్తించినవారు టూటౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ మానస కోరారు.

లారీ అపహరణ.. టైర్లు చోరీ



నేరేడుచర్లలోని ఎన్‌టీఆర్ కాలనీలో లారీని వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తులు

నేరేడుచర్ల: చోరీ చేసిన లారీని గుర్తు తెలియని వ్యక్తులు టైర్లు, రిమ్ములు దొంగిలించి వదిలేసిన వెళ్లిన సంఘటన సోమవారం నేరేడుచర్లలో చోటుచేసుకుంది. వివరాలు.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని తడకమళ్ల ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట లారీని చోరీ చేశారు. అనంతరం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలో గల కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి వెంట లారీని వదిలేశారు. లారీ టైర్లు, రిమ్ములను చోరీ చేశారు. సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోయామని బాధితులు పేర్కొంటున్నారు. ఈ లారీ మిర్యాలగూడలోని తడకమళ్ల రోడ్డు వద్ద పార్కింగ్ చేసి ఉండగా దొంగిలించినట్లు వన్ టౌన్ పోలీసులు పేర్కొంటున్నారు. లారీని నేరేడుచర్లలో వదిలిన విషయాన్ని గుర్తించి యాజమానికి సమాచారం అందించడంతో పోలీసులతో కలిసి లారీకి వేరే రిమ్ములను అమర్చి మిర్యాలగూడకు తీసుకెళ్లారు.

12 సిలిండర్లు పట్టివేత

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన 12 గృహ వినియోగ సిలిండర్లను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో సిలివేరు శ్రీశైలం అనే వ్యక్తి గృహ వినియోగ సిలిండర్లను బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నాడు. శ్రీశైలం ఇంట్లో అక్రమంగా సిలిండర్లు నిల్వ ఉన్నాయనే పక్కా సమాచారం అందడంతో ఎస్ఓటీ పోలీసులు సోమవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇంట్లో నిల్వ చేసిన 12 సిలిండర్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణమల్నార్ తెలిపారు.

నష్టపోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటాం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



కోదాడ: తమ్మర వాగు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం: మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్టకు వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయించి వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటామని నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద రెండుచోట్ల తెగిన సాగర్ ఎడమ కాల్వ కట్టను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సాగర్ ప్రాజెక్టు నుంచి, పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్‌వాటర్ ఎక్కువగా రావడంతో ఎడమ కాల్వ కట్ట రెండు చోట్ల తెగిందన్నారు. వరద ప్రభావంతో దాదాపు 300 ఎకరాల పంట నీటి మునిగిందన్నారు. వరద నీరు కాగితరామచంద్రాపురంలోకి రాకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. భారీ వర్షాలకు కోదాడ, హుజూర్‌నగర్ నియోజవర్గాల్లో రైతులకు, ప్రజలకు తీరని నష్టం జరిగిందన్నారు. రెండు రోజుల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, నీటి పారుదలశాఖ సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ ధర్మతేజ, ఈఈలు రామకిశోర్, సత్యనారాయణ, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ, స్థానిక తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, సాగర్ ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

కోదాడ: ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు కోదాడ పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాలను సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. కోదాడ పెద్దచెరువు అలుగునీటితో ముంపునకు గురైన ఖమ్మం రోడ్డులోని శ్రీషిర్డీసాయినగర్ కాలనీ వద్దకు మంత్రి వెళ్లి అక్కడి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమ్మర వాగు, శ్రీరంగాపురం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ముంపు ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం శ్రీనివాస్‌రెడ్డి, కందుల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బిర్యాని కోసం వెళ్లి మృత్యువాత



నాగం రవికుమార్



నాగం రవికుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ: బిర్యాని తెచ్చుకుందామని కారులో బయలుదేరిన నాగం రవికుమార్ అలియాస్ మురళీకృష్ణ (45) కారుతో సహా వాగులో కొట్టుకుపోయి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలు.. నాగం రవికుమార్ కోదాడ పట్టణ పరిధిలోని 34వ వార్డు మాతానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు. కోదాడకు చెందిన నాగం రోజాను వివాహం చేసుకుని కోదాడలోనే స్థిరపడ్డాడు. గతంలో కోదాడలో వైన్స్ షాపు నడిపేవాడు. ఇతడి భార్య.. పిల్లల చదువు కోసం హైదరాబాద్‌లో ఉంటుండగా రవికుమార్ ఒక్కడే కోదాడలో ఉంటున్నాడు. శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో బిర్యాని తెచ్చుకుంటానని స్నేహితులతో చెప్పి కారులో బయలుదేరాడు. మాతానగర్ నుంచి టీచర్స్ కాలనీ మీదుగా బైపాస్ సమీపంలో ఉన్న దాబాకు ఒక్కడే బయలుదేరినట్లు అతడి మిత్రులు చెబుతున్నారు. ఉలక వాగు ఉధృతిని గమనించకపోవడంతోపాటు వంతెన తక్కు ఎత్తులో ఉండడంతో మధ్యలోకి వెళ్లిన తరువాత భయానికి కారు ఆపాడు. అంతలోనే వరద పెరగడంతో కారుతో సహా కొట్టుకుపోయాడని, అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో గమనించలేదని స్నేహితులు చెబుతున్నారు. ఉదయం వాగులో కారు కనపడడంతో కోదాడ మాజీ సర్పంచ్ ఏర్నేనిబాబు క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. అందులో రవికుమార్ మృతి చెంది ఉన్నాడు. రవికుమార్‌కు భార్య రోజా, ఇద్దరు కుమారులు నాగం సాయితేజ, వెంకటేష్ ఉన్నారు. రవికుమార్ మృతదేహాన్ని సోమవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సందర్శించి నివాళులర్పించారు.

కుమారుడి దాడిలో గాయపడిన తండ్రి మృతి



ఎల్లయ్య(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : తండ్రి తిట్టాడని ఆవేశంతో విచక్షణ కోల్పోయి కుమారుడు.. తండ్రిని విపరీతంగా కొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో గత నెల 25న బోనాల పండుగ రోజున పర్వతం ఎల్లయ్య(45), అతడి కుమారుడు పర్వతం శ్రీశైలం కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న తండ్రి ఎల్లయ్య, తన కుమారుడిని దుర్భాషలాడాడు. దాంతో ఆవేశంతో విచక్షణ కోల్పోయిన కుమారుడు శ్రీశైలం.. తండ్రిని విపరీతంగా కొట్టి, కడుపులో తన్నాడు. తీవ్ర గాయాలపాలైన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అదేరోజు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎల్లయ్య ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

8న 'కూరెళ్ల' కు పౌర సన్మానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

నల్లగొండ టౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఇటీవల భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు స్వీకరించిన విషయమే తెలిసిందే. ఈ సందర్భంగా ఈ నెల 8న విఠలాచార్యకు నల్లగొండలోని సాహిత్య సామాజిక సేవా సంస్థల ఆధ్వర్యంలో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ తెలిపారు. సన్మాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నల్లగొండలోని విశ్వకర్మ కమ్యూనిటీ హాల్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సన్మాన కార్యక్రమానికి సాహిత్య అభిమానులు, రచయితలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కన్నెగంటి సత్యనారాయణ చారి, కన్వీనర్ పెందోట సోము, కటకం వెంకటాచారి, తండు కృష్ణ కౌండిన్య, బండారి శంకర్, రాచకొండ గిరి, అబ్బోజు మదనాచారి, సొల్లేటి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- బస్సు డ్రైవర్ మృతి, మరో ముగ్గురికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: ముందున్న లారీని ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు గాయపడిన ఘటన చౌటుప్పల్ మండలం ధర్మాజీగూడెం సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళుతోంది. ఈ క్రమంలో ధర్మాజీగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒంగోలు జిల్లా కందుకూర్ మండలం అప్పుకుంట గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ చెంచు రామయ్య(35) తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రామయ్య మృతిచెందాడు. బస్సు క్లీనర్ కోటేశ్వర్ రావు, ప్రయాణికులు మాకాల మహేష్, కంకనాల అన్నపూర్ణలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

పోలీసులకు దొంగ అప్పగింత

భువనగిరి క్రైం : రాయగిరి గ్రామంలో సోమవారం గుడిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు.. బొమ్మలరామారం మండలం పల్లికుంట్ల తండాకు చెందిన దరావత్ శంకర్ భువనగిరి మండలం రాయగిరిలోని దుర్గామాత గుడిలో దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. కొట్టం రేణుక, కొట్టం రాజమణి, వాటికి మాధవిలు గుడి తెరిచి శుభ్రం చేసేందుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి దుర్గామాత గుడిలోని ఇత్తడి గంట విప్పుతూ కనిపించాడు. వారు చుట్టుపక్కలవారిని పిలిచి దొంగను పట్టుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

కంటైనర్, ఆయిల్ ట్యాంకర్ ఢీ.. తప్పిన ప్రమాదం

- ఆయిల్ లూటీ చేసిన స్థానికులు



పామాయిల్ తీసుకెళ్తున్న స్థానికులు

చివ్వెంల(సూర్యాపేట) : అతివేగంగా వెళ్తున్న ఇనుప చువ్వల లోడ్ కంటైనర్.. పామాయిల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని రోళ్లబండ తండా శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఇనుప చువ్వల లోడుతో వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌కు రంధ్రం ఏర్పడి నూనె కిందజారి పోతుండగా, గమనించిన స్థానికులు, క్యాన్లు, డ్రమ్ములు, బిందెలు తీసుకొచ్చి నూనె ఎత్తుకెళ్లారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

- టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయాలు ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీ ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. విద్యుత్ సర్కిల్ కార్యాలయాల సీఈలు, ఎస్ఈలతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలతో భారీ వృక్షాలు, ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయని తెలిపారు. ముందుగా కూలిపోయిన చెట్లను తొలగించి కొత్త స్తంభాలను, లైన్లను వేయాలని సూచించారు. గత రెండు రోజులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. సూర్యాపేట జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని, 1200కు పైగా విద్యుత్ స్తంభాలు కూలిపోగా, 4 సబ్ స్టేషన్లకు నష్టం జరిగిందన్నారు. మొత్తం 2,417 విద్యుత్ స్తంభాలు, 21 ట్రాన్స్‌ఫార్మర్లు, 18 సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ సిబ్బంది పనిక్షేత్రంలోనే ఉండి పునరుద్ధరణ పనుల్లో పాల్గొనాలని కోరారు. పాడైపోయిన విద్యుత్ పరికరాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి సరిపడ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

• ఉప్పొంగిన సంగమం



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కృష్ణానదిలో నాగార్జునసాగర్ నుంచి 5,41,941 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో దామరచర్ల మండలం వాడపల్లి వద్దనున్న కృష్ణా, మూసీ నదుల సంగమంలో నీరు భారీగా చేరింది. ఇక్కడి పుష్కర ఘాట్లు నీట మునిగాయి. - మిర్యాలగూడ

విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసి, ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. తిరుమలగిరి సాగర్ మండలంలోని రాజవరం జెడ్పీహెచ్ఎస్ వ్యాయామ ఉపాధ్యాయుడు పసుపులేటి నర్సింహారావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస పంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలన్నా, చదువులో అంతరాలు తగ్గాలన్నా విద్యారంగా పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోనే ఉండాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు అధ్యక్షతన జరిగినటీ కార్యక్రమంలో వెంకటేశం, నర్సింహ, రాజు, కృష్ణమూర్తి, చంద్రయ్య, శ్రీనివాస్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వాగులో చిక్కుకున్న చెంచులు

- సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- చీకటి కావడంతో రెస్క్యూ టీం సహాయక చర్యలకు ఆటంకం

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజులు పాటు కురిసిన వర్షాలకు దుందుబి వాగు ద్వారా వస్తున్న వరదతో డిండి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు సోమవారం అలుగు పోసింది. దీంతో ప్రాజెక్టు డ్యాంపై నుంచి అలుగు పోతుండటంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతమైన డిండి వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండల పరిధిలోని గోనబోయనపల్లి గ్రామ శివారులోని వాగు మధ్యలోనున్న రాతి బండ (దయ్యంగుండు)పై నివాసం ఉంటున్న చెంచులు జెల్ల గురువయ్య, నీరంజనమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాపయ్య, సత్తయ్యతో పాటు మరో ఆరుగురు చిక్కుకుపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే చీకటి పడటం, తిరిగి వర్షం ప్రారంభం కావడంతో చెంచులను బయటికి తీసుకురావడానికి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా మారింది. వాగు ఉధృతి పెరిగితే రాతిబండ మునిగి పోయే ప్రమాదం ఉందని, రెస్క్యూ టీం ద్వారా చెంచులను సురక్షితంగా తీసుకు వచ్చే చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారిలో దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, సీఐ సురేష్, ఎస్ఐ.రాజు, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో డానియల్ తదితరులు ఉన్నారు. చెంచులు నిత్యావసర సరుకుల నిమిత్తం వారం రోజుల కొకసారి గోనబోయనపల్లికి వస్తుంటారని గ్రామస్తులు తెలిపారు.



గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో వరిపొలాల్లో ఇసుక మేటలు

• ఆలయాన్ని చుట్టిన కృష్ణమ్మ



మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ చేరిన వరద నీరు



హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలంలో నీట మునిగిన పత్తి పంట

కాగితరామచంద్రాపురం అతలాకుతలం



నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపాన నీట మునిగిన వరి పొలాలు

నడిగూడెం: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామ సమీపాన సాగర్ ఎడమ కాల్వ కట్ట 132, 133 కిలోమీటర్ల వద్ద రెండు చోట్ల తెగింది. దీంతో వరద నీరు వరి పొలాలను ముంచెత్తింది. కట్ట తెగిన రెండు చోట్లలో అండర్ టన్నెల్స్ (యూటీలు) ఉండడంతో ఆ వరద నీరు ఊళ్లోకి రాకుండా పంట పొలాల వైపు మళ్లింది. యూటీలు లేకుంటే కాగితరామచంద్రాపురం గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకునేది. వరదంతా పొలాల మీదుగా పారడంతో ఇసుక మేట వేసింది. దాదాపు 300 ఎకరాలకు పైగా వరిపంట, 50కి పైగా విద్యుత్ మోటార్లు నీట మునిగాయి. అలాగే 10కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

ఎస్కేప్ గేట్లు తెరవకపోవడం వల్లే..

ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి బ్యాక్ వాటర్ ఉధృతి సాగర్ ఎడమ కాల్వ వైపు పెరిగింది. దీంతో ఎడమ కాల్వ నిండుగా ప్రవహించింది. 133 కిలోమీటర్ వద్ద ఎస్కేప్ గేట్లు ఉన్నప్పటికీ వాటిని అధికారులు సకాలంలో తెరకపోవడంతో కాల్వ కట్ట రెండు చోట్ల తెగినట్లు రైతులు చెబుతున్నారు.

13 ఎకరాల్లో వరి మునిగింది

సాగర్ కాల్వకట్ట రెండు చోట్ల తెగడంతో వరదంతా పొలాల మీదుగా పారింది. నాకున్న 13 ఎకరాల్లో వరి పూర్తిగా నీటి మునిగింది. నాలుగు విద్యుత్ మోటార్లు కూడా నీట మునిగాయి. అప్పు చేసి వరి సాగు చేపట్టాను. అధికారులు నష్టపరిహారం చెల్లించాలి.

– ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి



సూర్యాపేట రూరల్ : మూసీ ప్రాజెక్టు నుంచి 7 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



నడిగూడెం: రత్నవరం వద్ద దెబ్బతిన్న కల్వర్టు



చిలుకూరు : నారాయణపురంలో రోడ్డు తెగిపోవడంతో గ్రామం నుంచి సీత్లాతండా, దూదియాతండాకు నిలిచిపోయిన రాకపోకలు